డ్రాగన్ ఫ్రూట్.. లాభాలు ఫుల్

ఒకసారి పెట్టుబడితో 10 ఏళ్లకు పైగా రాబడి

- నందిరాజుపాలెంలో ఆరు ఎకరాల్లో విశ్రాంత ఉపాధ్యాయుడు సాగు
- తొలకరి తర్వాత తయారుకానున్న డ్రాగన్ పండ్లు
- మెట్ట, ఎర్ర నేలలు సాగుకు అనుకూలం


నందిరాజుపాలెంలో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ తోట


ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన డ్రాగన్ పండ్లు

బెల్లంకొండ: అందరూ వెళ్లే దారిలో కాకుండా.. కొత్తగా సాగు చేయాలన్న విశ్రాంత ఉపాధ్యాయుని ఆలోచన ఆయన్ను డ్రాగన్ ఫ్రూట్ సాగు వైపు తీసుకువెళ్లింది. ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్న పండ్లకు డిమాండ్ ఉండడంతో పలు ప్రాంతాలకు వెళ్లి, అన్ని విషయాలను తెలుసుకున్నాడు. మూడేళ్ల క్రితం తన ఆరు ఎకరాల భూమిలో సేంద్రీయ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగును చేపట్టాడు. సాగులో మెలకువలు తెలుసుకుని లాభాలను ఆర్జించడంతో పాటుగా పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. బెల్లంకొండ మండలంలోని నందిరాజుపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మారెళ్ళ సాంబశివారెడ్డి ఉద్యోగ విరమణ తరువాత కూడా ఖాళీగా ఉండకుండా సాగును చేపట్టి విజయపథంలో దూసుకుపోతున్నాడు. మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో ఆరు ఎకరాల్లో సాగు చేపట్టినట్లు తెలిపారు. ఒకసారి నాటితే 9వ నెల నుంచి డ్రాగన్ ఫ్రూట్స్ నుంచి ఫల సాయాన్ని పొందవచ్చని చెబుతున్నారు. పంట సాగుకు మెట్ట ప్రాంత భూములు అనుకూలంగా ఉంటాయని, ఫిబ్రవరి నుంచి నవంబర్ చివరి వరకు ఫల సాయాన్ని అందిస్తాయని చెప్తున్నారు.

పంట సాగు ఇలా...

డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసేందుకు మెట్ట, ఎర్ర నేలలు అనుకూలం. పొలంలో 6 అడుగులు ఎత్తు ఉండే సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్ మట్టల నుండి సేకరించిన విత్తన మట్టలను సిమెంట్ స్తంభం చుట్టూ నాటుకోవాలి. మూడు నెలల్లో స్తంభం చుట్టూ మొక్క విస్తరిస్తుంది. ఒక్కొక్కటిగా డ్రాగన్ ఫ్రూట్ ఫల సాయం


తోటలో సాగు చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సాంబశివారెడ్డి

వస్తుంది. విస్తారంగా ఫల సాయం పొందేందుకు నవంబర్– ఫిబ్రవరి మధ్య వచ్చే పూతను ఎప్పటికప్పుడు తొలగించడం ఉత్తమం. దీంతో ఫిబ్రవరి నుంచి అధికంగా ఫల సాయం వస్తుంది. సాగు చేపట్టిన 9 నెలల నుంచి ఎకరానికి నాలుగు నుంచి పది టన్నుల దిగుబడి వస్తుంది.

ఎకరానికి మూడు వేల మొక్కలు

పలు ప్రాంతాల నుంచి 2022లో మొక్క రూ.70 చొప్పున కొనుగోలు చేసి, ఎకరానికి 3వేల మొక్కలు చొప్పు ఆరు ఎకరాల్లో 18 వేల మొక్కలను నాటారు. సిమెంట్ పోల్స్, మొక్కలు, డ్రిప్, ఫెన్సింగ్ తదితర ఖర్చులు కింద ఒక్కో ఎకరానికి రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటిన 9వ నెల నుంచి 25 ఏళ్ల వరకు దిగుబడినిస్తాయి. మొదటి ఏడాది ఒక్కో మొక్క నుంచి ఒక కిలో, రెండో ఏడాది 5 కిలోలు, మూడో ఏడాది 13 కిలోలు, నాలుగో ఏడాది 20 కిలోలు, 27 కిలోల వంతున పంట కోతకు వస్తుంది. సాధారణంగా రసాయన ఎరువులతో పండిస్తే కాయ 700 గ్రాముల వరకు వచ్చి మూడు రోజులే నిల్వ ఉండగా.. సేంద్రీయంగా సాగు చేయడం వల్ల 250 నుంచి 400 గ్రాముల వరకు వచ్చి 15 రోజులు పాటు నిల్వ ఉంటుంది. పొలం వద్ద కాయలను కిలో రూ.200 చొప్పున విక్రయిస్తుండగా, టన్నుకు పైబడి ఆర్డర్లు వచ్చినప్పుడు కిలో రూ.130 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, నల్గొండ, హైదరాబాదు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

రైతులను ప్రోత్సహించాలి

ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో డ్రాగన్ సాగును పాక్షికంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వాలు సాంప్రదాయ పంటలైన వరి, జొన్న తదితర పంటల వలె లాభదాయకమైన డ్రాగన్ సాగును ప్రోత్సహించాలి. పంట నిర్వహణ సులభంగా ఉంటుంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కల్పించి, మార్కెటింగ్ వసతులను ఏర్పాటు చేయాలి. నూతన పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం ద్వారా వ్యవసాయ పరిశ్రమలు పెరిగి రైతుకు లాభదాయకంగా ఉంటుంది.

– మారెళ్ల సాంబశివారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, నందిరాజుపాలెం, బెల్లంకొండ

అమరుల త్యాగం మరువలేనిది


సెల్యూట్ చేస్తున్న ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు, ఎస్‌ఐ అమినుద్దీన్


మానవహారంగా విద్యార్థులు, ప్రజా సంఘాలు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరుల త్యాగం మరువలేమని సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమం పాఠశాలలో అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులు సేవే పరమావధిగా విధులు నిర్వర్తించడం జరుగుతుందన్నారు. ముందుగా పోలీస్ అమరులకు సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐ షేక్ అమినుద్దీన్, పోలీస్ సిబ్బంది, పరివర్తన నిర్వాహకుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి

పెదకూరపాడు: అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేని పెదకూరపాడు ఎస్సై గిరిబాబు అన్నారు. సోమవారం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదకూరపాడు గ్రామంలో పోలీసు సిబ్బంది, విద్యార్థుల ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు, అసాంఘిక శక్తుల అణిచివేతకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

ఎలుకల నివారణకు ఉచితంగా మందు పంపిణీ

నకరికల్లు: వరిలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సోమవారం తెలిపారు. రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె కలిపి తయారు చేసిన విషపు ఎరను రైతు సేవ కేంద్రాల్లో రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. 10 గ్రాముల చొప్పున తీసుకొని పొలంలోని ఎలుక బొరియల్లో వేసి మూసివేయాలన్నారు. వివరాలకు రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు మందు పంపిణీ..

క్రోసూరు: క్రోసూరు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలోని క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, రాజుపాలెం, అమరావతి మండలాల్లో వరి సాగు చేస్తున్న రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు ఏడిఏ వి.హనుమంతరావు తెలిపారు. కావున ఆయా మండలాల్లోని వరిసాగు రైతులు సామూహిక ఎలుకల నివారణకు కావాల్సిన నూనె, నూకలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయ మండలాల వ్యవసాయశాఖ ఏవోలను సంప్రదించాలని కోరారు. మందు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సామూహికంగా ఈ మందు మిశ్రమాన్ని ఎలుకల బొరియల్లో పెట్టి నివారించుకోవాలని కోరారు.

బెల్లంకొండ: గ్రామ రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. వరి పైరులో ఎలుకల నిర్మూలన కోసం రైతు సేవా కేంద్రం సిబ్బంది మందును రతులకు ఇస్తారని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి తీసుకోవాలని చెప్పారు.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: హోంగార్డు ఆత్మహత్యకు యత్నించిన ఘటన సత్తెనపల్లి పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. పట్టణంలోని ఎనిమిదో వార్డు క్రిస్టియన్ పేటకు చెందిన మోపర్తి భాస్కర్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె భర్త గతంలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. అది జీర్ణించుకోలేక కుమార్తె కూడా ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. ఈ క్రమంలో పెద్ద కుమార్తె కుమారుడుని తమకు ఇవ్వమని అల్లుడు తాలూకా బంధువులు ఒత్తిడి చేస్తుండడంతో మనస్థాపం చెందాడు. ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెంలో నివసిస్తున్న భాస్కర్ చిన్న కుమార్తె కూడా ఈ ఏడాది ఆగస్ట్ 18న ఆత్మహత్యకు యత్నించి ప్రాణా పాయం నుంచి బయట పడింది. ఈ క్రమంలో మనస్థాపం చెందిన భాస్కర్ జీవితంపై విరక్తి కలిగి ఈ నెల 20న శీతలపానియంలో ఎలుకల మందు కలుపుకొని తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. హుటాహుటిన పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. గత 20 సంవత్సరాలుగా భాస్కర్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు.

సామూహిక ఉపనయనం


సామూహిక ఉప నయనంలో విద్యార్థులు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఉన్న శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో సోమవారం ఉచిత సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ వేద పాఠశాల గురువులు వానపాముల రత్నచార్యులు వటులకు ఉపనయనం, హోమం తదితర పూజా కార్యక్రమాలను తల్లితండ్రులతో నిర్వహించారు. ఆశ్రమ మఠాధిపతులు లలితాంబ మాతాజీ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆశ్రమం తరుపున విద్యార్థులకు ఉచితంగా ఉపనయనం నిర్వహిస్తున్నమన్నారు. ఈసందర్భంగా వటులను ఆశీర్వదించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. ఆశ్రమం భాద్యులు చింతాడ సురేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం జమచేయాలి



పెదకూరపాడు : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పంట పెట్టుబడి సహాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, ప్రతినిధులతో కలిసి తహసీల్దారు దానియల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.50 వేల రుణం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతినిధులు ఎం.మస్తాన్‌రావు, వై.నరేంద్రబాబు, పి.నాగమల్లేశ్వరరావు, ఎన్ శ్రీకాంత్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

వృథా కానివ్వలేదు



పెదకూరపాడు: మిగిలిన ఆహారాన్ని వృథా కానివ్వమని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. 75 తాళ్లురు బేడబుడగ జంగాల కాలనీలో ఆదివారం ఆహారాన్ని అందజేశారు. జలాలపురం గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డి, ఉమాదేవి వివాహంలో భోజనం 200 మందికి తగ్గట్లు మిగిలిపోవడంతో ఇక్కడ పంపిణీ చేశారు. బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణ చంద్రరావు, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్నిబాబు, కో–ఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, షేక్ ఖలీల్, గూడెం పెద్ద కిన్నెర అచ్చయ్య, అంజయ్య ఉన్నారు.

బాలిక, బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

అమరావతి: స్థానిక ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్‌లో 10 వతరగతి చదువుతున్న అమరావతికి చెందిన బాలిక, బాలుడు కనపడకుండాపోయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉదయం 4 గంటల సమయంలో పాఠశాలలో ట్యూషన్‌కు వెళుతున్నామని చెప్పి వెళ్లిన బాలిక, బాలుడు సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. దీంతో పలుచోట్ల వెతికిన కుటుంబస భ్యులు పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను ఉన్నదాధికారులకు నివేదించామని, వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు .

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

సత్తెనపల్లి: ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ షమ్మి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజులపాటు ఈ ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి మండలానికి రెండు ఆధార్ కిట్లను కేటాయించడం జరిగిందన్నారు. కొమెరపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటిపూడి డిజిటల్ అసిస్టెంట్ కె.కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఆధార్ క్యాంప్ జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 22న కంకణాలపల్లి, 23న వెన్నాదేవి, 24 నుంచి 25 వరకు బృగుబండ గ్రామ సచివాలయాల్లో కంకణాలపల్లి డిజిటల్ అసిస్టెంట్ రెబినా డయానా ఆధ్వర్యంలో ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయన్నారు. పట్టణంలోని ఈ నెల 22న పాత సాలిపేట, వడ్లవల్లి సచివాలయ పరిధిలో, 23న అచ్చంపేట రోడ్డు, వడ్లవల్లి ఏరియా, 24న కొత్తపేట, వడ్లవల్లి, 25న వెంగళరెడ్డి నగర్, శాలివాహన నగర్ సచివాలయంలో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. పట్టణానికి మొత్తం మూడు ఆధార్ కిట్లు కేటాయించినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని సచివాలయంలో ఆధార్ సవరణ ప్రక్రియ ప్రతి రోజు జరుగుతుందని చెప్పారు.

అర్జీలన్నీ పరిష్కరించండి: ఎమ్మెల్యే భాష్యం


ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు: ప్రజా దర్బార్ ద్వారా ప్రజలు ఇచ్చిన సమస్యల అర్జీలన్నీ వివాదాలు లేకుండా పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో బి.మహేష్‌బాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్ మండల అధికారులను సమన్వయపరిచారు. ఈ సందర్భంగా పలువురు తమ భూమి ఆన్‌లైన్ చేయడం లేదన్న సమస్య తెలియజేయగా ఆ గ్రామ వీఆర్వో మస్తాన్ వలిని పిలిచి ప్రశ్నించారు. ఈ భూమి సమస్య కోర్టులో ఉన్నట్లు వీఆర్వో సమాధానం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే వివాదాలు లేకుండా, పరిష్కారం చేయదగిన అర్జీలన్నీ వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొంత మంది రైతులు రైతు భరోసా (పీఎం కిసాన్ నగదు) పడలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఏవో వేణుగోపాల్ ని సమస్య అడిగి తెలుసుకున్నారు. టెక్నికల్ సమస్యలుంటే అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల వారిగా అర్జీల కొరకు కౌంటర్లు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ప్రజలు, తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

తొండపిలో ఇరువర్గాల ఘర్షణ

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రెండు వర్గాల మధ్య మొదలైన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చింతిరాల సుధీర్, గోవిందు నాగయ్య మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. కొద్దిసేపటి తర్వాత గోవిందు నాగయ్య, మరికొంత మంది టీడీపీ మద్దతుదారులైన బోరుపోతు ఊదా, బోరుపోతు నాగేశ్వరరావు, సామ్యేలురాజు, మోహన్, మరికొంత మందితో కలిసి కర్రలు, ఇనుప రాడ్లతో చింతిరాల సుధీర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులపై దాడికి దిగారు. గమనించిన సుధీర్ బంధువులు ఇంటిపైకి వచ్చి కొట్టడమేంటని ప్రశ్నిస్తుండగా వారిపైనా విచక్షణా రహితంగా కర్రలతో దాడికి దిగారు. దాడిలో చింతిరాల సుధీర్‌కు, సుదీర్ తండ్రి వీరయ్య, తల్లి నాగమ్మ, అత్త మరియమ్మకు, అత్తోట విజయబాబు, బోరుపోతు రాజాకు గాయాలయ్యాయి. దాడుల నుంచి తప్పుకునే క్రమంలో మరో వర్గానికి చెందిన బోరుపోతు ఊదా, భిక్షాలు, నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన ఘటనపై ఇరువర్గాలు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నాయి. శాంతిభద్రతలు దృష్ట్యా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

బడి ముందర ఎడ్లు కట్టి, బండి పెట్టి..


పాఠశాల ఎదురుగా ఎద్ల బండి, కట్టేసిన ఎద్లు

రాజుపాలెం: మండలంలోని బీరవల్లిపాయ మండల ప్రాథమిక పాఠశాల చుట్టు పక్కల అపరిశుభ్రత తాండవిస్తోంది. పిల్లలు బడికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. పాఠశాల ఎదురుగా గ్రామస్తులు ఎడ్లు కట్టేయడం, ఎడ్ల బండి పెట్టడం వల్ల ఇబ్బంది కరంగా ఉంది. పిల్లలు బడికి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఎడ్లు తల విసరడంతో భయపడుతున్నారు. పాఠశాల ముందు, పక్కన చెత్తాచెదారం పేరకపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. ఉపాధ్యాయులు గ్రామస్తులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



పెదకూరపాడు : మండల పరిధిలోని పాటిబండ్ల ఆర్‌సీఎం హైస్కూలు పాఠశాలలో సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. 165 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, నలుగురికి 'దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు. వారికి ఉచితంగా కండ్లజోళ్లు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ పీవీడీ శివరామారావు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయ కుమారి, ఉపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి, ఏఎన్ఎం నూర్జహాన్, ఆశ వర్కర్లు రమీజా, మల్లేశ్వరి, సుజాత, పద్మావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ధర్మ ప్రచారం



అమరావతి: మండలంలోని లింగాపురం గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ప్రబోధానంద యోగీశ్వర సందేశాలను ప్రతి ఒక్కరికి అందేలా ప్రచారం చేస్తున్నామని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి – హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రాతు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రపంచానికి అందించిన జ్ఞాన సంపద అందరికి వివరించేందుకు ప్రతి గ్రామంలోఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి సభ్యులు కృష్ణా రావు, శివలింగం నాయక్, బ్రహ్మం. హరిబాబు, రామోజీ నాయక్, పట్టాభి శ్రీను , సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఇన్నారెడ్డికి ప్రతిభా అవార్డు



రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (ఫాదర్) ఇన్నారెడ్డి అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులు ఇన్నారెడ్డికి సోమవారం అభినందనలు తెలిపారు. ఈ ప్రతిభా పురస్కార అవార్డును ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతులమీదుగా అందుకున్నారు. అభినందనలు తెలిపిన పాఠశాల ఫాదర్స్ విజయ్ పీటర్‌రెడ్డి, కిరణ్, ఉపాధ్యాయులున్నారు.

అయ్యప్పలకు సద్ది ఏర్పాటు



నకరికల్లు: స్థానిక శ్రీ గంగమ్మతల్లి ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు నిత్యం ఉచిత సద్ది ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సహకారంతో 40 రోజుల పాటు సద్ది కార్యక్రమం కొనసాగిస్తున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన డీకొండ రామదాసు సద్దిని సమర్పించారు. స్థానిక అయ్యప్పమాలధారణ భక్తులతో పాటు సమీప గ్రామాల నుంచి వచ్చిన మాల ధారణ భక్తులు సద్దిని స్వీకరించారు. గ్రామంలోని మాలధారణ భక్తులే కాక ఇతర గ్రామాల నుంచి సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

ఖో-ఖో జిల్లా జట్టుకు విద్యార్థి ఎంపిక



క్రోసూరు: గుంటూరులోని వెంగళాయపాలెంలో ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఖోఖో పోటీల్లో క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థి మల్లాది సుధాకర్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ ఎం.మేరీ సుజన్ సోమవారం తెలిపారు. అండర్ 18 జూనియర్ బాలుర విభాగం పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 25, 27, 28 తేదీల్లో చిత్తూరు జిల్లా కాణిపాకం జరిగే అంతర్జిల్లాల పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్స్‌పల్, పీఈటీ నరసింహారావు, ఉపాధ్యాయులు క్రీడాకారుడిని అభినందించారు.

రాజకీయ క్రీడా రగడ

సత్తెనపల్లి: మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 ఉమ్మడి గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ బాల బాలికల క్రీడాకారుల జట్ల ఎంపికలో రాజకీయాలను చొప్పించి ఇష్టం వచ్చిన క్రీడాకారులను ఎంపిక చేసి సొమ్ము చేసుకున్నారని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపించారు. సోమవారం పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల ఎంపిక నియామకం అనేది ఒక ప్రహసనంగా మారి, పల్నాడు స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ ఒంటెత్తు పోకడలతో క్రీడాకారుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపికల్లో కొంత సొమ్మును డిమాండ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసే నిమిత్తం స్కూల్ గేమ్స్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. కానీ, ఈ క్రీడల్లో రాజకీయాలను చొప్పించి తన ఇష్టం వచ్చినటువంటి క్రీడాకారులను ఎంపిక చేసి సొమ్ము చేసుకోవడం జరుగుతోందన్నారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మళ్లీ ఎంపికలు నిష్పక్షపాతంగా జరిగే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. 19 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతకాలతో కూడిన ఫిర్యాదును జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పంపినట్లు తెలిపారు.

ఆక్రమణ చెర నుంచి విడిపించండి

ముప్పాళ్ళ: సర్వే చేసి ఆక్రమణల నుంచి భూమిని విడిపించాలని మండలంలోని తొండపి గ్రామానికి చెందిన వృద్ధుడు షేక్ ఖాసిం సాహెబ్, ఆయన కుమార్తె బీబీ సోమవారం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లోను వినతిపత్రాలు అందించారు. గ్రామంలో సర్వే నంబరు 468 సీ 2ఏ లో 4.25 ఎకరాల భూమి ఉందని, ఇందులో 3.14 ఎకరాల భూమిని ఐదుగురు ఆక్రమించి, నానా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. మిగిలిన 1.11 ఎకరం భూమిని ఆరోగ్యం బాగా లేక పోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన మరొకరి విక్రయించి, రిజిస్ట్రేషన్ చేశామన్నారు. అయితే అందులో కొలతలు వేసేందుకు వెళ్లిన తనతో, కొనుగోలుదారు మట్టా శివమ్మతో, సర్వే సిబ్బందిపై ఆక్రమణదారులు దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. సర్వే అనంతరం ఆన్‌లైన్ చేసేందుకు కూడా రెవెన్యూ అధికారులు సహకరించటం లేదని పేర్కొన్నారు. 1955లో తన తాత పెద్దసాహెబ్ కొమెర వెంకటేశ్వర్లు అన్నదమ్ముల వద్ద కొనుగోలు చేసి సత్తెనపల్లి రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. 1964 నుంచి జీవనోపాధి నిమిత్తం కండ్లకుంట గ్రామంలో ఉంటూ పొలాన్ని కౌలుకు ఇచ్చామన్నారు. ఇంత వరకు తన భూమిని ఎవరికీ అమ్మలేదని, గతంలో కూడా పలుమార్లు అర్జీలు అందించినా పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ ఏఈగా మస్తాన్



రాజుపాలెం: మండల విద్యుత్ ఏఈగా కేపీ మస్తాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాచవరం మండలంలో ఏఈగా పనిచేస్తు బదిలీపై రాజుపాలెం మండలం ఏఈగా వచ్చారు. భాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.